అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



37వ డివిజన్‌లో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ పరిధిలోని 37వ డివిజన్ క్రాంతినగర్ మున్సిపల్ స్కూల్ వద్ద నుంచి సోమవారం ఆయన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను పక్కాగా అందిస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ప్రజలు ఆదరించాలని కోరారు.

రూ.20లక్షలతో సీసీరోడ్డు, డ్రెయిన్ నిర్మాణం

41వ డివిజన్ మనుమసిద్దినగర్‌లో సుమారు రూ.20లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీ ఆదాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి అధిక స్థాయిలో నిధులను తీసుకొస్తున్నామని తెలిపారు. స్థానిక సమస్యలను నాయకులు, కార్యకర్తలు తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 41వ డివిజన్ విస్తరిస్తున్నందున ఈ ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు మరిన్ని నిధులు కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో విజయ డైయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాస యాదవ్, విజయ లక్ష్మి నగరపాలక సంస్థ అధికారులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఆదాల

ఆరోగ్యమిత్రలకు కలెక్టర్ ప్రశంసలు



ఆరోగ్యమిత్రకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు ఆరోగ్యమిత్రలను కలెక్టర్ ఎం హరినారాయణన్ అభినందించారు. నెల్లూరు జీజీహెచ్ ఆరోగ్యమిత్ర ఏ దీప్తి ఏప్రిల్‌లో, కావలి కందుకూరి ఆస్పత్రి ఆరోగ్యమిత్ర కే శిరీషా మేలో ఉత్తమ సేవలు అందించడంతో వైఎస్సార్ హెల్త్ కేర్ ట్రస్టు సీఈఓ ప్రశంసా పత్రాలతో పాటు రూ.5వేల చొప్పున చెక్కులను పంపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఉత్తమ సేవలందించిన ఆరోగ్యమిత్రలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఆరోగ్యమిత్రలు పేదలకు మంచిసేవలు అందించి మన్ననలు పొందాలని కోరారు. వైఎస్సార్ హెల్త్ కేర్ ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్ పాల్గొన్నారు.

ఎంఎంఈ అసోసియేషన్ అధ్యక్షుడిగా పరుచూరి

• 45ఏళ్ల చరిత్రలో తొలిసారిగా ఎన్నికలు
• ఇప్పటి వరకు ఇనామస్‌గానే ఎన్నిక



ఎన్నికల అధికారితో నూతన కార్యవర్గ సభ్యులు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం రసవత్తరంగా జరిగాయి. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన ఎన్నికల్లో పరుచూరి శీనయ్య, ఇనమాల చినబాబు ప్యానెల్స్ పోటీపడ్డాయి. మొత్తం 145 ఓట్లకు గానూ 119 పోలయ్యాయి. ఇందులో 82 ఓట్లు పరుచూరి ప్యానెల్, 37 ఓట్లు ఇనమాల ప్యానెల్ దక్కించుకున్నాయి. దీంతో 45 ఓట్ల మెజార్టీతో పరుచూరి ప్యానెల్ విజయం సాధించింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా పరుచూరి శీనయ్య, గౌరవాధ్యక్షుడిగా ఎస్‌కే హుమయూన్, ఉపాధ్యక్షుడిగా పీఎస్ ప్రతాప్, కార్యదర్శిగా ఇనయతుల్లా, కోశాధికారిగా ఆర్ వంశీనాథ్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ రవి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏ ప్రవీణ్, మహిళా కార్యనిర్వాహకురాలిగా బీ విజయతో పాటు మరో 12 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కాగా 1978లో ఎంఎంఈ అసోసియేషన్ ఏర్పడగా ఇప్పటి వరకు ఇనామస్‌గానే కార్యవర్గాన్ని ఎన్నుకుంటూ వస్తున్నారు. తొలిసారిగా 2023లో అసోసియేషన్‌కు ఎన్నికలు జరగడం విశేషం ఎన్నికల అధికారిగా వేణుగోపాల్ వ్యవహరించారు.

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ శర్మద అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆమె పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాంపై వచ్చే అర్జీలకు సరైన ఎండార్స్‌మెంట్ ఇచ్చినప్పుడే రీ ఓపెన్ శాతాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సంపత్‌కుమార్, ఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, మేనేజర్ వినయతుల్లా, రెవెన్యూ అధికారులు సమద్, రాజేశ్వరి, శ్రీనువాసులు, తదితరులు పాల్గొన్నారు.

డీపీఓలో ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్

నెల్లూరు(పొగతోట): జిల్లా పంచాయతీ కార్యాలయాన్ని ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ మహేష్ సోమవారం సందర్శించారు. శిక్షణలో భాగంగా డీపీఓలో రికార్డుల నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. ఆయన వెంట డీపీఓ సుస్మితారెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని హరనాథపురం, ఎంజీనగర్, రాజేంద్రనగర్, కోటమిట్ట విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని నెల్లూరుటౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

• హరనాధపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మురళీకృష్ణ విద్యుత్ ఫీడర్‌లో అదనపు విద్యుత్ ట్రాన్సఫార్మర్ ఏర్పాటు చేస్తున్న కారణంగా హరనాధపురంలోని 3, 5, 11వ వీధులు, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

• ఎంజీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా విద్యుత్ టవర్స్ ఏర్పాటు చేస్తున్నందున లక్ష్మీనరసింహపురం, రామాలయం వీధి, బారాషహీద్‌దర్గా, ఆదర్శనగర్, లేక్‌వ్యూ కాలనీ, జేవీఆర్ కాలనీ, నెల్లూరురూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

• రాజేంద్రనగర్, కోటమిట్ట విద్యుత్‌సబ్‌స్టేషన్ల పరిధిలో నూతన విద్యుత్ టవర్లను ఏర్పాటు చేస్తున్నందున పాతమున్సిపల్ కార్యాలయం, గుప్తా పార్క్, ములుమూడిబస్టాండ్, పరమేశ్వరినగర్, మనుమసిద్దినగర్, పుత్తా లేఅవుట్, కుక్కలగుంట, జెండావీధి, ఖుద్దూస్‌నగర్, మన్సూర్‌నగర్, కామాటివీధి, గిడ్డంగివీధి, సిటిజన్ స్కూల్, పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

నేడు సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌పై అవగాహన

నెల్లూరు (టౌన్): నూతన విద్యా విధానంలో భాగంగా డిగ్రీ కళాశాలల్లో అమల్లోకి రానున్న సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గిరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు అవగాహన సదస్సు జరుగుతుందన్నారు. డిగ్రీలో ప్రథమ సంవత్సరంలో చేరనున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1 నుంచి శ్రీశత చండీయాగం

నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమ సందర్భంగా మూలాపేటలోని శంకర మఠంలో జూలై 1 నుంచి 3వ తేదీ వరకు శ్రీ శత చండీయాగ పూర్వక మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషా కుమారి దంపతులు సోమవారం తెలిపారు. కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి అనుగ్రహంతో కంచి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులతో త్రయాహ్నికదీక్షగా జరిగే మహోత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకుపాత్రులు కావాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య



కామాక్షి మృతదేహం

నెల్లూరు(క్రైమ్): అప్పుల బాధ తాళలేక ఓ వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఉడ్‌హౌస్‌సంఘంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..ఉడ్‌హౌస్‌సంఘంలో వెంకట సుబ్బయ్య, కామాక్షి(52) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. సుబ్బయ్య బేల్దారి పనులు, కామాక్షి టిఫిన్ అంగడి నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కుమారుడికి మతిస్థిమితం సరిగాలేదు. కామాక్షి సైతం అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో అప్పులు చేసి మరీ చికిత్స చేయించుకుంటున్నారు. కుమార్తెకు వివాహం చేయడంతో మరింత అప్పులపాలయ్యారు. అప్పట్నుంచి కామాక్షి అప్పుల విషయమై తన అక్క పద్మకు చెప్పి బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం సుబ్బయ్య పనులకు వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న కామాక్షి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. ఈ విషయాన్ని ఆమె తన అక్క పద్మకు ఫోనుచేసి చెప్పింది. పద్మ హుటాహుటిన చెల్లెలు ఇంటివద్దకు చేరుకుంది. అపస్మారక స్థితిలో ఉన్న కామాక్షిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించి సుబ్బయ్యకు జరిగిన విషయాన్ని తెలియజేసింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కామాక్షి కొద్దిసేపటికే మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి భర్త నవాబుపేట పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్సై కే తిరుపతయ్య ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాల సాధనకు కృషి చేయాలి



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు అలసత్వం వీడి కృషి చేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌తో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రతి వారం నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించడానికి సచివాలయాల వారీగా ఇంజినీరింగ్ అసిస్టెంట్ల స్థాయిలో సమీక్షలు నిర్వహించుకుని పనుల్లో పురోగతి సాధించాలన్నారు. రాష్ట్రంలోని మెగా లేఅవుట్లలో ఒక్కటైన కావలి లేఅవుట్‌పై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమీక్షిస్తున్న దృష్ట్యా సంబంధిత లేఅవుట్‌ను పూర్తి చేసేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. జేసీ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ గృహ నిర్మాణాల్లో ప్రతి వారం 25 శాతం పురోగతి తప్పకుండా ఉండాలన్నారు. అందుకు తగినట్లుగా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకుని చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, మెప్మా పీడీ రవీంద్ర, డ్వామా పీడీ వెంకట్రావు, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సహచరులకు హోంగార్డుల చేయూత



విజయలక్ష్మికి నగదు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులకు ఆర్థిక చేయూత అందించేందుకు సహచర హోంగార్డులు తమ ఒక్క రోజు వేతనాన్ని అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కుల రూపంలో ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి తన కార్యాలయంలో సోమవారం అందజేశారు. దర్గామిట్ట పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన టీ విజయలక్ష్మికి రూ.4,05,410, కమ్యూనికేషన్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కే వెంకటరావుకు రూ.4,00,440, బుచ్చిరెడ్డిపాళెం పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన టీ సుబ్రహ్మణ్యానికి రూ.3,91,920 చొప్పున అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది శేషజీవితాన్ని హాయిగా గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. వ్యాయామాలు చేసుకుంటూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. సహచరులకు ఆర్థిక చేయూతనందించిన జిల్లా హోంగార్డులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ డీ హిమవతి, ఏఓ విజయకుమార్, హోమ్‌గార్డ్స్ డీఎస్పీ చంద్రమోహన్, బీ సెక్షన్ సూపరింటెండెంట్ ఖతీజాబేగం, తదితరులు పాల్గొన్నారు.

న్యూ హోండా షైన్ 100సీసీ బైక్ విడుదల



బైకును మార్కెట్లోకి విడుదల చేస్తున్న దృశ్యం

నెల్లూరు (టౌన్): శ్రీ షిర్డీషా హోండా షోరూం ఆధ్వర్యంలో న్యూ హోండా షైన్ 100సీసీ బైక్‌ను మార్కెట్లోకి సోమవారం విడుదల చేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌లో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ సెక్రటరీ నవీన్‌కుమార్‌రెడ్డి, కూరగాయల మార్కెట్ సెక్రటరీ గయాజుద్దీన్ చేతుల మీదుగా బైక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీషిర్డీషా హోండా మేనేజింగ్ పార్టనర్ కొండా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ హోండా కంపెనీ నేటి యువతకు తగినట్లుగా ఎప్పటికప్పుడు మార్కెట్లోకి నూతన బైకులను విడుదల చేస్తోందన్నారు. నూతన బైకు లీటరుకు 84 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందన్నారు. బైక్‌ను సేఫ్టీ ఫీచర్స్, అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేశారని, ఐదు రంగుల్లో లభిస్తుందని చెప్పారు. బైకు ఎక్స్ షోరూం ధర రూ.66,300గా నిర్ణయించినట్లు తెలిపారు. చీఫ్ జనరల్ మేనేజర్ రవికుమార్, హోండా జీఎం మీరా మొహిద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



కామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సహకార ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామానాయుడు కోరారు. ఈ మేరకు గాంధీబొమ్మ సెంటర్‌లోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద ఏపీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1964 చట్ట సవరణను రద్దు చేయాలని, జీఓ నంబర్ 36, 90 ప్రకారం వేతనాలు, హెచ్‌ఆర్పీ పాలసీని అమలు చేయాలని, ప్రభుత్వంతో సంబంధం లేకుండా ప్రతి ఐదేళ్లకు పేస్కేల్ రివిజన్ చేయాలని, 2019 ఏప్రిల్ 1 నాటి వేతన సవరణను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అనంతరం బ్యాంకు చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సీఈఓ శంకర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఐ నాయకులు రామరాజు, అసోసియేషన్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు, కరుణాకర్‌రెడ్డి, రాజశేఖర్, మల్లికార్జున, మస్తాన్, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా పట్టాభిరామిరెడ్డి జయంతి



నెల్లూరు(బృందావనం): సమాజ సేవకుడు ఏనుగు పట్టాభిరామిరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. నెల్లూరు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో పట్టాభిరామిరెడ్డి చిత్రపటానికి, నక్కలోళ్ల సెంటర్‌లోని పట్టాభిరామిరెడ్డి విగ్రహానికి నెల్లూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొండాశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు. క్లబ్ ఇన్‌చార్జి సెక్రటరీ ఉదయభాస్కర్, కోశాధికారి ఏనుగు రమణారెడ్డి, సభ్యులు బాబు, ఆగస్టస్ పాల్గొన్నారు.

కేసులో సెక్షన్లు మార్పు

నెల్లూరు(క్రైమ్): విద్యుత్ పోల్‌పై నుంచి జారిపడి లైన్‌మన్ అసిస్టెంట్ మృతి చెందిన కేసు సెక్షన్లను పోలీసులు మార్పుచేశారు. వివరాలు..టీపీగూడూరు మండలం కృష్ణారెడ్డిపాళేనికి చెందిన చిరంజీవి(28) విద్యుత్‌శాఖలో మీటర్ రీడర్‌గా, లైన్‌మన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అతనికి పది నెలల క్రితం వివాహమైంది. భార్య గర్భిణి. ఈ నెల 15న చిరంజీవి మాగుంటలేఅవుట్‌లో పోల్ ఎక్కి వైర్లు లాగుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తలకు తీవ్రగాయమైంది. ఆయన్ని సహచరులు కృష్ణయ్య, ఫయాజ్ చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 17న చిరంజీవి మృతి చెందాడు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు అప్పట్లో దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత 174సీఆర్‌పీసీ కింద కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం కేసును 304(ఎ) సెక్షన్ కింద మార్చారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచారు. అనంతరం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నోవా బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అన్నదానం, రామచంద్రారెడ్డి ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నాయకులు శ్రీనివాసులరెడ్డి, ఫయాజ్, గణేష్‌బాబు, అల్లావుద్దీన్, రాజేష్‌రెడ్డి, నాగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు దేశ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మినిమం టైం స్కేల్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. జేఏసీ నాయకులు యువరాణి, కామాక్షి, బాబు, భరత్, సురేఖ పాల్గొన్నారు.

వైఎస్సార్ వీరాభిమాని మోపెడ్ యాత్ర



నెల్లూరు రూరల్: వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన కామాల్ దివంగత సీఎం వైఎస్సార్ వీరాభిమాని. ఆయన కడప నుంచి అమరావతికి చేపట్టిన మోపెడ్ యాత్ర సోమవారం నెల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కామాల్ కలిసి యాత్ర వివరాలు తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలంటూ తన మోపెడ్ యాత్ర ద్వారా ప్రచారం చేస్తున్నానని చెప్పాడు. దీంతో కామాల్‌ను ఎంపీ అభినందించారు.

సీపీఎం నాయకుల ధర్నా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్ వద్ద సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు, గృహ వినియోగదారులకు ప్రీ పెయిడ్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.